క్లుప్తంగా

ఆరోగ్య ప్రదాయిని జగనన్న సురక్ష

కురబలకోట: జగనన్న సురక్ష ఆరోగ్య ప్రదాయినియని ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. మంగళవారం చింతమాకులపల్లె సచివాలయం వద్ద సర్పంచ్ కోళ్ల విమలమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య పరీక్షలతో పాటు వైద్యం కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. అవసరమైన జబ్బులకు ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. బైసాని చంద్రశేఖర్ రెడ్డి, కోళ్ల వాసుదేవరెడ్డి,ఎంపీడీఓ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. మంగళవారం గోపిదిన్నె, కొటాల గ్రామ పంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలు, అమలు, లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి వివరించారు. సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మనోహర్‌గౌడ్, ఏపీవో అంజనప్ప, ఏఈలు అశోక్, సుజాత, ఎంఎస్ అధ్యక్షురాలు కుమారమ్మ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

మదనపల్లె సిటీ: ఆంగ్లసంవత్సరాది పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్, శైవక్షేత్రం మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడపడం వల్ల రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. వివరాలకు వన్ డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. హార్సిలీహిల్స్‌కు 24 బస్సులు 5603 కిలోమీటర్లు తిప్పి రూ.4,60,063 3 ఆదాయం వచ్చిందన్నారు. ఈపీకే 82.11, ఓఆర్ 163 వచ్చిందన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ఆరు బస్సులు 1474 కిలోమీటర్లు తిప్పి రూ.1,30,347 ఆదాయం వచ్చిందన్నారు. ఈపీకె 88.43, ఓఆర్ 176 వచ్చిందన్నారు. సిబ్బంది సహకారంతోనే మంచి ఆదాయం వచ్చిందన్నారు.

జనసేనలో భగ్గుమన్న వర్గ విభేదాలు

పీలేరు : జనసేన పార్టీ వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మంగళవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో బాహాబాహీకి దిగారు. జన సేన నియోజకవర్గం ఇన్‌చార్జి బెజవాడ దినేష్, జనసేన జిల్లా కార్యదర్శి కలప రవి అంతర్గత విభేదాలు బట్టబయలు చేస్తూ నడిరోడ్డుపై పరస్పరం దాడికి దిగారు. పార్టీ కార్యక్రమాల్లో తమ ఆధిపత్యం కోసం గొడవపడినట్లు సమాచారం. ప్రధాన నాయకులు ఘర్షణకు దిగడంతో అక్కడే ఉన్న పార్టీ కార్యకర్తలు ఏమిచేయలేక నిమ్మకుండిపోయారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మదనపల్లె తాలూకా ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా 2024 క్యాలెండర్‌ను ఆర్డీఓ ఎం.ఎస్.మురళి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు ఆర్డీఓ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సంఘం రాజీలేని పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, అధ్యక్షులు నాగేంద్రబాబు, కార్యదర్శి శివరాంప్రసాద్, కోశాధికారి ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

కేవీపల్లె : యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

నలుగురు జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె: పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్లపల్లె పంచాయతీలో కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

సారా విక్రేత అరెస్టు

అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లె వద్ద స్థానికుడైన మంజునాథ్ (37) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కలకడలో ఆరుగురు ..

కలకడ : మండలంలో ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.50,390 నగదు , 52పేకాట ముక్కలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ కోనేటివాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది హరిబాబు, లక్ష్మీనారాయణ, తాతయ్య, కరుణాకర్, రమేష్, గురవయ్య లతో కలిసి పేకాట స్థావరం పై దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నాయకుల చిత్తశుద్ధి.. వేగంగా అభివృద్ధి

- ప్రారంభోత్సవానికి సిద్ధమైన 50 పడకల ఆస్పత్రి
- రూ.7 కోట్లతో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రి భవనాలు
- రూ.5.20 కోట్లతో ప్రభుత్వ భవనాలు


ప్రారంభానికి సిద్ధంగా 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి


నిర్మాణాలు పూర్తి చేసుకున్న సచివాలయ భవనాలు

వాల్మీకిపురం: ఎన్నో దశాబ్దాల వాల్మీకిపురం వాసుల కల ఎట్టకేలకూ నెరవేరింది. పట్టణం నడిబొడ్డున ప్రభుత్వం రూ. 7కోట్లతో 50 పడకల ఆస్పత్రి మంజూరు చేసింది. ప్రస్తుతం నిర్మాణపనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మండలంలో రూ.5.20 కోట్లతో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లీనిక్‌లు, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వీటికి కూడా త్వరలో ప్రారంభోత్సవం చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది.

రూ.7కోట్లతో 50 పడకల ఆస్పత్రి భవనాలు:

వాల్మీకిపురం పట్టణంలో ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రి ఉంది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల ప్రత్యేక చొరవతో ఏడాది కిందట రూ.7కోట్ల నిధులతో 50 పడకల ఆస్పత్రి మంజూరైంది. ప్రస్తుతం భవన నిర్మాణపనులు పూర్తి అయ్యాయి. నూతన ఆస్పత్రిలో మూడు బ్లాక్‌లలో రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. అత్యంత ఆధునిక సాకర్యాలతో నిర్మాణాలు జరిగాయి. మంచినీటి సరఫరా, ఆక్సిజన్ ప్లాంట్, పోస్టుమార్టం గది. లిఫ్ట్‌సాకర్యం, ప్రవేశమార్గాలు, విశాలమైన ఆవరణం, సీసీ రోడ్లు నిర్మించి, పచ్చనిచెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

మూడు ఆపరేషన్ థియేటర్లు

నూతన కమ్యూనిటీ ఆస్పత్రిభవనంలో మొత్తం మూడు ఆపరేషన్ థియేటర్లు నిర్మించారు. అందులో అవసరమైన ఆధునాతన సామగ్రి, పరికరాలను అందుబాటులో కి తీసుకొచ్చారు. ప్రతిరోజు 400 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రిలో మొత్తం ఎనిమిది మంది వైద్యులు ఉన్నారు. కాగా అందులో నలుగురు స్పెషలిస్టు వైద్యులు ఉన్నారు. ఆస్పత్రిలో మొత్తం 16 మంది నర్సులు, 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

400కు పైగా గ్రామాలకు అందుబాటులో వైద్యసేవలు

వాల్మీకిపురంలో ప్రస్తుతం నిర్మించిన 50 పడకల ఆస్పత్రితో వాల్మీకిపురం, గుర్రంకొండ, నిమ్మనపల్లె మండలాలపరిధిలో సుమారు 400కు పైగా గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో అత్యవసర వైద్యసేవల కోసం రోగులు మదనపల్లెకు వెళ్లేవారు. 50 పడకల ఆస్పత్రితో రోగులకు అత్యవసర వైద్యసేవలు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. ఈ మూడు మండలాల పరిధిలో జరిగిన రోడ్డుప్రమాద బాధితులకు, ఇతర అత్యవసర రోగులకు ఈ ఆస్పత్రి ప్రధాన కేంద్రంగా మారనుంది.

రూ. 29 కోట్లతో అభివృద్ధి పనులు

మండలంలో వివిధ పథకాల కింద మంజూరైన రూ.29 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రూ. 20 కోట్లతో నాడు–నేడు పథకం కింద రెండు విడతలుగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. మండలంలోని పలు పంచాయతీల్లో రూ.5.20కోట్లతో గ్రామసచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లీనిక్‌లు, వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటయ్యాయి. రూ. 2.40 కోట్లతో వాల్మీకిపురంలో రెండు, జర్రావారపల్లెలో ఒకటి, చారావాండ్లపల్లెలో చింతపర్తిలో ఒకటి. మూరేవాండ్లపల్లెలో ఒకటి మొత్తం ఆరు గ్రామసచివాల భవనాలు నిర్మాణాలు పూర్తి అయ్యాయి. రూ. 1.20 కోట్లతో జర్రావారిపల్లెలో ఒకటి, టి.చాకిరేవుపల్లెలో ఒకటి, మంచూరులో ఒకటి, చింతపర్తిలో ఒకటి మొత్తం నాలుగు ఆర్బీకే భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. రూ.1.50 కోట్లతో వాల్మీకిపురంలోమూడు, జర్రావారిపల్లెలో ఒకటి, మంచూరులో ఒకటి, చారావాండ్లపల్లెలో ఒకటి మొత్తం ఆరు విలేజ్ క్లీనిక్ భవనాలు నిర్మాణాలు పూర్తిఅయ్యాయి. రూ. 20 లక్షలతో ఫతేపురం, నాగంవారిపల్లె, దండువారిపల్లె, వాల్మీకిపురంలో మొత్తం నాలుగు వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. త్వరలో వీటకి ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. ఇవికాక రూ. 2 కోట్లతో సీసీ రోడ్లు, రూ.1.50 కోట్లతో మరుగునీటి కాలువల నిర్మాణపనులు పూర్తి చేశారు.

కార్పొరేట్ స్థాయిలో కమ్యూనిటీ వైద్యశాల



వాల్మీకిపురంలో కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో కమ్యూనిటీ వైద్యశాలను ఏర్పాటు చేశాం. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు కావడంతో పాటు పనులు కూడా పూర్తి అయ్యాయి. ఈ వైద్యశాల ఏర్పాటుతో సుమారు 400లకుపైగా గ్రామాలకు అత్యవసరమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వాల్మీకిపురం పట్టణవాసుల దశాబ్దాల కల నెరవేరింది.

\- చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

శరవేగంగా అభివృద్ధి పనులు



వాల్మీకిపురం మండలంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. ఇప్పటికే కోట్లాది రుపాయలతో ప్రభుత్వ భవనాలు పూర్తి అయ్యాయి. అన్ని గ్రామాల్లో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామాల్లో వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేశాం. మసీదులకు, దేవాలయాలకు అభివృద్ధి నిధులు మంజూరు చేశాం. ఏ ప్రభుత్వంలో కూడా చేయనటువంటి అభివృద్ధి మా హాయంలో జరగడం సంతోషంగా ఉంది.

\- పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

రైతాంగానికి ప్రభుత్వం అండ

\- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


బి.కొత్తకోట కొత్తపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : రైతాంగం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన సహకారం గత ప్రభుత్వాలు చేయలేదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని గట్టు, నాయనబావి పంచాయతీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమం గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళలు తమ కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందిన ఆర్థికచేయూత, పథకాల ద్వారా పొందిన సేవల గురించి ఎమ్మెల్యేకు చెప్పి సంతోషం వ్యక్తం చేశారు. దిన్నెమీదపల్లె, శీతివారిపల్లె, గుండ్లపల్లె, నల్లగుట్టపల్లె, తరికోట, తొట్లివారిపల్లె, కొత్తపల్లె, గట్టు, పత్రవారిపల్లె, గుట్టపాళ్యం, నాయనబావి, కంబాలపల్లె, కాయలవారిపల్లె, ఆకులవారిపల్లె, యర్రమ్మగారిపల్లె, రెడ్డివారిపల్లె, దేవరాజుపల్లెల్లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలు, మహిళతో మమేకమై మాట్లాడారు.

కొత్తగా ఆరు విద్యుత్ కేంద్రాలు :

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బి.కొత్తకోట, ఇందిరమ్మకాలనీ, రామాపురం, పాతకోట, పులికల్లు, మద్దినాయునిపల్లె, దిన్నిమీదపల్లెలో కొత్తగా విద్యుత్‌కేంద్రాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటికి స్థల ఎంపిక పూర్తయిందన్నారు. వీటి నిర్మాణంతో విద్యుత్ సమస్యలు పూర్తిగా తొలగి, వ్యవసాయానికి అంతరాయం లేకుండా మెరుగైన సరఫరా అవుతుందని చెప్పారు.

4వేల ట్రాన్స్‌ఫార్మర్లు...

గత టీడీపీ పాలనలో రైతులకు అన్యాయం జరిగితే తాము సరిదిద్దామని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు పెండింగ్‌లో ఉంచిన, కొత్తవి కలిపి 4వేలకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏకకాలంలో పంపిణీ చేసి రికార్డు సృష్టించామన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా గట్టులో ఎంపీ మిథున్‌రెడ్డి నిధులు రూ.2.5లక్షలతో నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు ఉమామహేశ్వరి, జయరామిరెడ్డి, ఎంపీటీసీలు ఆకులబాలకృష్ణ, రామసుబ్బారెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ రెడ్డెమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

\- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : సంక్షేమ సారథి, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన రాష్ట్ర ముఖ్యమంతి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీలేరు పట్టణం 1వవార్డులోని యల్లమంద క్రాస్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అందిన పథకాలు లబ్ధిదారులకు చదివి వినిపించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వంద శాతం నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలు మరింత అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మరోసారి మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జి.వి. రాకేష్ రెడ్డి, ఉదయ్‌కుమార్, మహితాఆనంద్, స్టాంపుల నరసింహారెడ్డి, షాకీర్, నరేష్, సుధాకర్, ఎన్.వి. చలపతి, హబీబ్‌బాషా, హుమయూన్, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎల్ఏలను నియమించుకోవాలి

మదనపల్లె : కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బంది, అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ... జనవరి 12లోపు ఓటరు జాబితాకు సంబంధించి క్లెయిమ్‌లు సమర్పించాలన్నారు. ఫారం–7లను సరైన ఆధారాలు లేకుండా బోగస్‌గా అప్‌లోడ్ చేయవద్దన్నారు. సరైన ఆధారాలు లేకుండా సమర్పిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమన్నారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలికవసతులపై నివేదిక అందించాలన్నారు. పోలింగ్ కేంద్రం ఎదుట అందరికీ కనిపించేలా బీఎల్ఓ పేరు, ఫోన్ నెంబర్ రాయాలన్నారు. డోర్ నెంబర్ లేకుండా ఓటు నమోదుచేయవద్దని బీఎల్వోలను ఆర్డీఓ ఆదేశించారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్, కోవిడ్‌పేషంట్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నుంచి జింకాచలపతి, టీడీపీ నుంచి దేవరింటిశీన, సుధాకర్, జనసేన చిరంజీవి, ఆప్ కృష్ణమూర్తి, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, దైవరాజన్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎలక్షన్ డీటీ నూర్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి

మదనపల్లె : పశువుల్లో వచ్చే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మదనపల్లె పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో మంగళవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా జనవరి 2వ తేదీ నుంచి 32వవిడత గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి టీకాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఉచితంగా వేస్తోందన్నారు.

పల్లవోలులో ఆడుదాం ఆంధ్రా పోటీలు

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం గడిలో సర్పంచ్ బీబీ ఆయేషా ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రికెట్, షటిల్, వాలీబాల్ పోటీలలో క్రీడాకారులు పాల్గొనగా, గెలుపొందిన టీం సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయడానికి ఆడదాం ఆంధ్రా ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ షమీవుల్లా, నాయకులు ఇస్తియాక్ అహ్మద్, జునేద్, సచివాలయ కన్వీనర్ నూరు, కార్యదర్శి రెడ్డిప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

\-డీఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె సిటీ: పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు మత్తు వ్యసనాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు తీసుకుంటే మనిషి మృగంలా ప్రవర్తిస్తారన్నారు. చదువుకోవాల్సిన వయస్సుల్లో ఇలాంటి వాటిని వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆర్డీవో ఎం.ఎస్.మురళి మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడి ఉంటే వెంటనే స్నేహితులు గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ వల్లిబసు, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్ఎం సుబ్బారెడ్డి, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు

పెద్దతిప్పసముద్రం: జగనన్న పాలనలో పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపల్లిలో నిర్వహించారు. సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ ప్యారీజాన్, సయ్యద్‌బాషా, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ శంకర్‌ల ఆధర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

సైనిక పాఠశాల ఇంటర్ హౌస్ పోటీల్లో ప్రతిభ

కలికిరి: పాఠశాల స్థాయిలో జరిగిన ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ క్రీడా పోటీలలో తుంగభద్ర హౌస్ టీం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ సీఎస్ పరదేశి ఒక తెలిపారు. గోదావరి, క్రిష్ణా, పెన్నా, తుంగభద్ర టీంలు పోటీలలో పాల్గొనగా తుంగభద్ర హౌస్‌కు చెందిన విద్యార్థులు సీనియర్ విభాగంలో వరుణ్, జూనియర్స్ విభాగంలో అంకిత్, బాలికల విభాగంలో భావన ప్రథమ స్థానాల్లో గెలుపొంది హౌస్‌ను ఓవరాల్ చాపింయన్‌గా నిలిపారు. విజేత తుంగభద్ర హౌస్‌కు వ్యక్తిగత, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందచేసి అభినందించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

పీలేరు రూరల్ : రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ కె. ధనుంజయలు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 రకాల రెవెన్యూ సేవలు గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీలు విజయ్‌కుమార్, సుబ్రమణ్యం, ఆర్ఐ చాణక్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



రేపు పింఛన్ల పంపిణీ

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. ప్రభుత్వం పెంచిన పింఛను సొమ్ముతో పాటు, కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని చెప్పారు.